సాక్షి విశాఖపట్నం

గురువారం । 5 । సెప్టెంబర్ । 2024

జయజయ శుభకర వినాయకా..




గణపతి ఉత్సవాల్లో భాగంగా స్వామి విగ్రహాలను పందిళ్లకు తరలించే సమయం ఆసన్నమైంది. శనివారం వినాయక చవితి కావడంతో విగ్రహ తయారీదారుల నుంచి ముందుగానే ఉత్సవ నిర్వాహకులు మండపాలకు గణనాథుడిని తీసుకెళ్తున్నారు.



భీమిలి–ఆర్‌కే బీచ్ తీర ప్రాంతాల్లో బుధవారం షూటింగ్ సందడి నెలకొంది. హీరో నారా రోహిత్, హీరోయిన్ శ్రీదేవి నటిస్తున్న 'సుందరాకాండ'కు సంబంధించి సన్నివేశాలను చిత్రీకరించారు. – కొమ్మాది

న్యూస్‌రీల్

నేడు జిల్లా స్థాయి గురుపూజోత్సవం

మహారాణిపేట: సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా గురువారం జిల్లాస్థాయి గురుపూజోత్సవం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ తెలిపారు. వెంకోజీపాలెంలోని సీఎంఆర్ ఫంక్షన్ హాలు వేదికగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామని, జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు ప్రదానం చేస్తామని పేర్కొన్నారు.

'కార్మిక హక్కులు కాలరాస్తున్న మోదీ'



మాట్లాడుతున్న ఏఐడీఈఎఫ్ జాతీయ నాయకుడు కుమార్

అక్కిరెడ్డిపాలెం: పాత పెన్షన్ విధానం కొనసాగించాలని ఆల్ ఇండియా డిఫెన్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్(ఏఐడీఈఎఫ్) జాతీయ నాయకుడు కుమార్ డిమాండ్ చేశారు. షీలానగర్‌లోని ఓ హోటల్‌లో బుధవారం ఆల్ ఇండియా డిఫెన్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సెమినార్ జరిగింది. ఈ సందర్భంగా ఏఐడీఈఎఫ్ జాతీయ నాయకులు కుమార్, రాజీవ్ కుమార్ పరాశర్ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన యూనిఫైడ్ పెన్షన్ స్కీం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు వ్యతిరేకంగా ఉందని ఆరోపించారు. భారత రాజ్యాంగం కల్పించిన కార్మిక హక్కులను కాలరాస్తూ.. బీజేపీ ప్రభుత్వం ఉద్యోగులకు వ్యతిరేకంగా పనిచేస్తోందని దుయ్యబట్టారు. రక్షణ పౌర ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఏఐడీఈఎఫ్ మాత్రమే ఉద్యమిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎన్ఎంస్ స్టీల్, డీజీఎన్ పీ డాక్‌యార్డ్, ఎంవోపీ ఉద్యోగులతో పాటు ఈఎస్‌సీ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధానకార్యదర్శి సబ్బుం కిరణ్‌కుమార్, అధ్యక్షుడు ఉడతా అప్పలరాజు, ఉపాధ్యక్షుడు మన్నాల ప్రసాద్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌సీఐలో బాంకెట్ మేనేజర్ కోర్సు ప్రారంభం

ఆరిలోవ : ఫుడ్ క్రాఫ్ట్ ఇనిస్టిట్యూట్(ఎఫ్‌సీఐ)లో బుధవారం కొత్తగా డిప్లొమా ఇన్ బాంకెట్ మేనేజర్ కోర్సును ప్రారంభించారు. సాయుధ దళాల సిబ్బందికి శిక్షణ ఇస్తున్న ఈ కోర్సును ఇండియన్ నేవీ కమాండర్ ప్రశాంత్ అవస్థి ప్రారంభించారు. ఈ కోర్సులో 44 మంది సాయుధ దళాల సిబ్బంది చేరినట్లు ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఉజ్వల్‌కుమార్ తెలిపారు. వారికి ఐదు నెలలు పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా ప్రశాంత్ అవస్థను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎఫ్‌సీఐ ప్రిన్సిపాల్ రమణ, అసోసియేట్ అధ్యాపకుడు ఎస్.పార్థసారథి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎస్‌ఆర్‌ఎంవో, డిప్యూటీ సీఎస్‌ఆర్వో పోస్టుల భర్తీ

మహారాణిపేట: కేజీహెచ్‌లో సీఎస్‌ఆర్‌ఎంవో, డిప్యూటీ సీఎస్‌ఆర్వో పోస్టులను తాత్కాలిక ప్రాతిపదికన భర్తీ చేస్తున్నారు. డీఎంఈ మౌకిక ఆదేశాల మేరకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు సూపరింటెండెంట్ పి.శివానంద్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు ఈ పోస్టులకు దరఖాస్తు చేయవచ్చని, వర్క్ ఆర్డర్ ప్రాతిపదికన భర్తీ చేస్తామని పేర్కొన్నారు.

నావికాదళ పనులకు రక్షణేది?



- ఎక్కడికక్కడ ఐఎన్ఎస్ వర్ష పనుల నిలిపివేత
- కాంట్రాక్టర్లను వేధిస్తున్న కూటమి నేతలు
- మొన్నటివరకు ఉప్పు–నిప్పుగా వ్యవహరించిన ఆ ఇద్దరు..
- వసూళ్ల వ్యవహారంలో తాజాగా స్నేహహస్తం
- కంపెనీలకూ తప్పని కూటమి నేతల ఒత్తిళ్లు

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం

శత్రుదేశ దాడుల నుంచి కాపాడుకునేందుకు అత్యంత దుర్భేద్యంగా నిర్మిస్తున్న నావికాదళ స్థావర పనులకే రక్షణ లేకుండా పోతోంది. ఏకంగా శత్రుమూకలు అణుదాడులు చేసినా చెక్కుచెదరకుండా రాంబిల్లి వద్ద నిర్మిస్తున్న ఐఎన్ఎస్ వర్ష పనులు కాస్తా కూటమి నేతల బెదిరింపులతో నిలిచిపోయే పరిస్థితులు తలెత్తాయి. ఈ పనులు చేపడుతున్న కంపెనీలు సముద్రగర్భంలో కొన్ని పదుల కిలోమీటర్ల మేర దారిని నిర్మిస్తున్నాయి. ఇందుకోసం కంపెనీలు సమీపంలో మైనింగ్ చేస్తున్న వారి నుంచి భారీ బండరాళ్లను తరలిస్తున్నాయి. ఇక్కడ కాంట్రాక్టు చేపట్టిన సంస్థలకు ట్రిప్పుకు ఇంత ఇవ్వాలంటూ మొదట్లో కూటమి నేతలు బెదిరించారు. ఇందుకు సరేనంటూ ట్రిప్పుకు కొంత మొత్తం ఆ కాంట్రాక్ట్ సంస్థలు చెల్లించాయి.

ఇప్పుడు ఏకంగా పనుల్లోనే తమకు భాగస్వామ్యం **ఇవ్వాలంటూ** నిన్న మొన్నటి వరకు ఉప్పు–నిప్పుగా **ఉన్న** ఇద్దరు కూటమి నేతలు, ఓ ఎంపీ, ఎమ్మెల్యే **ఇప్పుడు** చేతులు కలిపి ఆయా సంస్థలపై ఒత్తిడి తెస్తున్నట్టు తెలుస్తోంది. లేని పక్షంలో పనులు సకాలంలో జరగకుండా ఎక్కడికక్కడ అడ్డంకులు సృష్టిస్తామని బెదిరించినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో వీరి ఒత్తిళ్లకు కొన్ని కంపెనీలు ఇప్పటికే తలొగ్గగా.. మరి కొన్ని కంపెనీలు అడిగినంత మేర భాగస్వామ్యం ఇస్తే తమకు గిట్టుబాటు కాదని వెనుకడుగు వేస్తున్నట్టు తెలుస్తోంది. ఫలితంగా ఆయా కంపెనీలు పనులు చేయకుండా నేతలు అడ్డుకున్నారు. మొత్తంగా అటు కంపెనీలను, ఇటు కాంట్రాక్టర్లను.. కూటమి నేతల ఒత్తిళ్లు బాగా కుంగదీస్తున్నాయి.

బాధితులకు రూ. కోటిచ్చారు.. మాకేది?

అనకాపల్లి జిల్లాలోని అచ్యుతాపురం సెజ్, పరవాడ ఫార్మాసిటీలోని రెండు కంపెనీల్లో జరిగిన ప్రమాదాల్లో 20 మంది కార్మికులు మరణించారు. వీరికి ఒక్కొక్కరికి చెరో కోటి చొప్పున ఆ కంపెనీలు నష్టపరిహారం ఇచ్చాయి. గాయపడిన వారికి కూడా నష్టపరిహారాన్ని అందజేశాయి. వీరి వైద్యానికి కానీ, నష్టపరిహారానికి కానీ ప్రభుత్వం నయా పైసా ఖర్చు చేయలేదు. నష్ట పరిహారం అందజేయడంలో మాత్రం ముందుంది. ఇక్కడితో ముగిసిందనుకున్న కంపెనీ యాజమాన్యాలకు కొత్త తలనొప్పులు వచ్చినట్టు తెలుస్తోంది. చనిపోయిన వారికి కోటి ఇచ్చారు సరే.... మరి మాకేటి? అంటూ కంపెనీలపై కూటమి నేతలు ఒత్తిళ్లు తెస్తున్నట్టు సమాచారం. ఇప్పటికే భారీ నష్టపరిహారం అందజేయడంతో పాటు చికిత్స ఖర్చులతో ఇబ్బందిగా మారిందని.. దీనికి తోడు మీకూ ఇవ్వాలంటే తమకు కష్టమంటూ వాపోయినట్టు తెలిసింది. అయితే తమను ప్రసన్నం చేసుకోకపోతే ఇబ్బందులు తప్పవంటూ హెచ్చరించినట్టు సమాచారం.

ఐఎన్ఎస్ వర్ష విశేషాలివీ..

- ఐఎన్ఎస్ వర్ష పేరుతో రాంబిల్లి వద్ద 670 హెక్టార్లల్లో సాగరతీర అంతర్భాగంలో రహస్య స్థావరాలను నిర్మిస్తున్నారు. ఒకేసారి 12 సబ్‌మెరైన్లను ఇక్కడ రహస్యంగా ఉంచేలా ఏర్పాట్లు చేస్తున్నారు.
- ప్రస్తుతం ఈఎన్‌సీ ప్రధాన కేంద్రంలోనే నేవల్ షిప్స్, సబ్‌మెరైన్‌లను ఉంచుతున్నారు. విశాఖపట్నం పోర్టు కూడా సమీపంలో ఉండటంతో కార్గో, కంటైనర్ షిప్స్‌తో నిరంతరం రద్దీగా ఉంటోంది. భద్రత దృష్ట్యా మరో రహస్య స్థావరం కోసం వర్షను నిర్మిస్తున్నారు.
- ఐఎన్ఎస్ అరిహంత్ వంటి న్యూక్లియర్ సబ్‌మెరైన్లు నెలల తరబడి సముద్ర గర్భంలో విధి నిర్వహణలో ఉంటాయి. 200 మీటర్ల లోతులో కదులుతున్నప్పుడు గుర్తించడం, ట్రాక్ చేయడం దాదాపు అసాధ్యం. అయితే ఇవి పోర్టు సమీపంలో లంగరు వేసినప్పుడు శత్రు గూఢచారి శాటిలైట్స్ సులభంగా గుర్తించగలవు. ఈ కారణంగానే వీటి సమాచారాన్ని గోప్యంగా ఉంచేలా భూగర్భంలోనే ఉంచేందుకు ఐఎన్ఎస్ వర్ష ఉపయోగపడుతుంది.
- ఐఎన్ఎస్ వర్షలో ఐదు టన్నెల్స్ ఏర్పాటు చేస్తున్నారు. ఈ సొరంగాల ద్వారా సబ్‌మెరైన్లు స్థావరంలోకి రాకపోకలు సాగిస్తుంటాయి.
- జలాంతర్గాములు ఉపరితలంపైకి రావాల్సిన అవసరం లేదు. అందువల్ల శత్రువులు వీటి జాడను కనిపెట్టలేరు.
- వర్ష బేస్‌లో సిబ్బంది విశ్రాంతి సౌకర్యాలు, మరమ్మతులు, నిర్వహణకు అనువుగా భవనాలు నిర్మిస్తున్నారు.



అండర్ గ్రౌండ్ బేస్ నమూనా

- మొత్తం 12 న్యూక్లియర్ సబ్‌మెరైన్‌లు ఒకే కాలంలో సముద్ర గర్భంలో ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నారు. డీజిల్, ఎలక్ట్రిక్ సబ్‌మెరైన్లను కూడా ఇక్కడి నుంచే ఆపరేట్ చేయగల సామర్థ్యం ఐఎన్ఎస్ వర్ష సొంతం.
- శత్రుమూకలు అణు దాడులు చేసినా.. వాటి నుంచి సురక్షితంగా ఉండేలా ఐఎన్ఎస్ వర్ష నిర్మాణం జరుగుతోంది.
- సబ్‌మెరైన్లలో అణు రియాక్టర్ల నిర్మాణం, అమర్చడం కూడా ఇందులోనే చేసుకునే వీలుంటుంది. నీటి అడుగున స్థావరం వద్ద మిస్సైల్ టెక్నికల్ పొజిషన్స్ అనే ఆయుధ నిల్వ సౌకర్యం కూడా ఉంటుంది.
- ఇక్కడ అరిహంత్ క్లాస్ సబ్‌మెరైన్లతో పాటు ఎస్–5, న్యూక్లియర్ ఎటాక్ సబ్‌మెరైన్లను కూడా ఇక్కడ నిర్వహించేందుకు అనువుగా నిర్మిస్తున్నారు.

అక్కయ్యపాలెంలో వైఎస్సార్ విగ్రహం ఏర్పాటు



అక్కయ్యపాలెంలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

సీతంపేట: జీవీఎంసీ 28వ వార్డు అక్కయ్యపాలెం లలితానగర్‌లో శివరామ స్వీట్ షాప్ పక్కన మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని మరల ఏర్పాటు చేశారు. ఇక్కడ వైఎస్సార్ విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు తొలగించిన విషయం తెలిసిందే. వైఎస్సార్ వర్ధంతి రోజునే విగ్రహాన్ని ధ్వంసం చేయడంతో ఆయన అభిమానులు, పార్టీ నాయకులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అభిమానుల కోరిక మేరకు వైఎస్సార్ సీపీ విశాఖ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు ఆదేశాలతో వార్డు ఇన్‌చార్జి పీలా వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో బుధవారం ఇక్కడ వైఎస్సార్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణతో కలిసి మహానేత విగ్రహానికి పూలమాలలతో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీలకతీతంగా అందరూ అభిమానించే మహానేత విగ్రహాన్ని ధ్వంసం చేయడం హేయమైన చర్యగా పేర్కొన్నారు. పార్టీ నాయకులు ఎం.సునీల్, అమ్మాజీ, శ్యామల, ఫరూఖీ, విజయపాల్, గౌషియ, లలితకుమారి, విజయలక్ష్మి, సుశీల, గొర్లె లక్ష్మి, హరికృష్ణ పాల్గొన్నారు.

వైఎస్సార్ విగ్రహం ధ్వంసంపై కేసు నమోదు

సీతమ్మధార: అక్కయ్యపాలెంలో వైఎస్ విగ్రహం ధ్వంసం చేసిన ఘటనపై ఫోర్తుటౌన్ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై ఈ నెల 2న వైఎస్సార్ సీపీ మహిళా జోనల్ ఇన్‌చార్జి పీలా వెంకటలక్ష్మి ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఈ మేరకు ఎస్ఐ కె.నర్సింగరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాఠాలు చెప్పిన కలెక్టర్

- చిట్టివలస హైస్కూల్లో టెన్త్ విద్యార్థులకు ఫిజిక్స్ బోధన
- 6, 10వ తరగతి విద్యార్థులతో పాఠ్యాంశాలపై చర్చ

తగరపువలస: కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఉపాధ్యాయునిగా మారారు. చిట్టివలస జెడ్పీ బాలుర, బాలికల హైస్కూళ్లను బుధవారం సందర్శించిన ఆయన 6, 10వ తరగతి విద్యార్థులతో పాఠ్యాంశాల గురించి చర్చించారు. ఆస్టరాయిడ్స్, సోలార్ సిస్టమ్, బయో డైవర్సిటీ, కంబాలకొండ, చిప్కో మూవ్‌మెంట్, తరిగిపోయే ఇంధన వనరులు, తరిగిపోని ఇంధన వనరులు, డెమోక్రసీ, దిశ చట్టం, రాజ్యాంగం, అక్షాంశాలు, రేఖాంశాలు, పరిపాలనలో విభాగాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి విద్యార్థులకు ఫిజిక్స్ బోధించారు. విద్యార్థులు చదువులో యాక్టివ్‌గా ఉండటంతో అభినందించారు. సెల్‌ఫోన్‌ను విజ్ఞానం కోసం మాత్రమే వినియోగించాలని సూచించారు. బాగా చదివి వృద్ధిలోకి రావాలని ఆకాంక్షించారు. విద్యార్థినులు హిందీ పద్యాలకు అభినయం చేయగా అభినందించారు. ఉపాధ్యాయులతో మాట్లాడి ల్యాబ్‌ను పరిశీలించారు. సీబీఎస్‌ఈ విధానం ఎంతవరకు దోహదపడుతుందో అడిగి తెలుసుకున్నారు.

బిర్యానీ నచ్చలేదు..రాగిజావ బాగుంది..

విద్యార్థులను మధ్యాహ్న భోజనం గురించి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. బిర్యానీ నచ్చడం లేదని గురువారం పెట్టే పులిహార బాగాలేదని, శనివారం అందించే ఆకుకూరలు బాగాలేవని కొందరు విద్యార్థులు తెలియజేశారు. రాగిజావ బాగుందని తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆకుకూరలు తీసుకోవడం వలన నీరసం తగ్గి ఆరోగ్యం బాగా ఉంటుందన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో..

కొండపేట అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార వారోత్సవాల్లో భాగంగా చిన్నారులకు అన్నప్రాసన చేశారు. గర్భిణులకు పౌష్టికాహార ప్యాకెట్లు అందించారు. సామూహిక సీమంతం కార్యక్రమంలో గర్భిణులను ఆశీర్వదించారు. కలెక్టర్ వెంట డీఈవో ఎల్.చంద్రకళ, తహసీల్దార్ పైల రామారావు, ఎంపీడీవో జానకి, ఎంఈవో శివరాణి, ప్రధానోపాధ్యాయుడు పొట్నూరు మురళీమోహనరావు, సీహెచ్ రోజామణి తదితరులున్నారు.



చిట్టివలస జెడ్పీ బాలికల హైస్కూల్లో పాఠ్యాంశాల గురించి విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

'ప్రేమ' భయంతో బాలిక ఆత్మహత్య

ఆరిలోవ: ఆరిలోవ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ బాలిక(17) ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలివీ.. అనకాపల్లి జిల్లా వాడచీపురుపల్లికి చెందిన బాలిక జీవీఎంసీ 9వ వార్డు పరిధి సంజయ్‌గాంధీ కాలనీలో తన అమ్మమ్మ వద్ద ఉంటోంది. తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి వరకు చదువుకుంది. ఆ సమయంలోనే తనతో పాటు చదువుతున్న సంజయ్‌గాంధీకాలనీకి చెందిన అబ్బాయితో ప్రేమలో పడింది. వారిద్దరూ వీడియోలు కూడా తీసుకున్నారు. ఇటీవల ఆ వీడియోలు బయటపడ్డాయి. దీంతో భయపడిన ఆ బాలిక మంగళవారం రాత్రి ప్రేమించిన అబ్బాయికి చనిపోతున్నానని ఫోన్ చేసి చెప్పింది. రాత్రి 10 గంటల సమయంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కొంతకాలంగా మద్దిలపాలెంలోని షాపులో అమ్మమ్మతో పాటు బాలిక పనిచేస్తోంది. వీరిద్దరూ ప్రతిరోజూ రాత్రి 11 గంటలకు ఇంటికి చేరుకునేవారు. మంగళవారం మాత్రం ఆ బాలిక అమ్మమ్మ కంటే ముందుగా రాత్రి 10 గంటలకే షాపు నుంచి ఇంటికి చేరుకుంది. ఆమె ఇంటికి చేరేలోగా ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు సంజయ్‌గాంధీకాలనీకి చేరుకుని కన్నీటిపర్యంతమయ్యారు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డిపోల్లో నిండుకున్న పంచదార

- 335 మెట్రిక్ టన్నులకు గాను 120 మెట్రిక్ టన్నుల పంచదార విడుదల
- ఇంకా 115 మెట్రిక్ టన్నులు అవసరం

మహారాణిపేట : చౌకధరల డిపోల్లో పంచదార పంపిణీ అరకొరగా పూర్తయింది. ప్రభుత్వ నిర్లక్ష్యం, పలు శాఖల సమన్వయం లోపం వల్ల పంచదార గత రెండు నెలల నుంచి రేషన్ డిపోలకు కేటాయించలేదు. ఈ నెలలో అరకొరగా కేటాయించడంతో మూడు రోజులకే అయిపోయింది. బుధవారం నగరంలో ఏ షాపులో కూడా పంచదార అందుబాటులో లేకపోవడంతో కార్డుదారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

కేటాయింపులు అరకొర

విశాఖలో 5,12,619 తెలుపు/రైస్ కార్డుదారులు ఉన్నాయి. వీరికి అరకిలో చొప్పున పంపిణీ చేయడానికి 335 మెట్రిక్ టన్నుల పంచదార అవసరం ఉంటుంది. కాని ఈనెల 120 మెట్రిక్ టన్నుల పంచదార విడుదల చేశారు. ఎంపిక చేసిన డీలర్లకు 400 ప్యాకెట్ల చొప్పున కేటాయించి చేతులు దులుపుకున్నారు. తెచ్చిన పంచదార ప్యాకెట్లను రెండు, మూడు రోజుల్లో డీలర్లు విక్రయించారు. వినాయక చవితి పండగ నేపథ్యంలో పంచదార కోసం వెళ్లిన కార్డుదారులకు నిరాశే ఎదురైంది. పంచదార అదనపు కేటాయింపుల కోసం ఎలాంటి సమాచారం లేదని అధికారులు చెబుతున్నారు. ఇచ్చిన పంచదారలో కొంత మంది డీలర్లు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ఇచ్చిన అర కిలోలో 50 నుంచి 70 గ్రాముల తూకం తక్కువగా ఇస్తున్నారని ఫిర్యాదులు వస్తున్నాయి. దీనిపై అధికారులు దృష్టి పెట్టాలని కార్డుదారులు కోరుతున్నారు.

నేడు కేంద్ర మంత్రుల రాక

మహారాణిపేట: కేంద్ర పంచాయతీరాజ్, మత్స్యశాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ గురువారం విశాఖ వస్తున్నారు. ఢిల్లీ నుంచి విమానంలో గురువారం రాత్రి 8.10 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ నుంచి నోవాటెల్‌కు చేరుకుని అక్కడే రాత్రికి బస చేస్తారు. 6న నోవాటెల్ హోటల్‌లో ఎగుమతిదారులు, ఇతర స్టేక్ హోల్డర్లతో జరిగే సమావేశంలో పాల్గొంటారు. రాత్రి 8.50 గంటలకు విమానంలో ఢిల్లీకి బయలు దేరుతారు.

- కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు గురువారం విశాఖ వస్తున్నారు. ఉదయం 7.30 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ నుంచి ప్రభుత్వ సర్క్యూట్ హౌస్‌కు చేరుకుని కొద్దిసేపు విశ్రాంతి తర్వాత శ్రీకాకుళం వెళతారు.

కేంద్ర మత్స్యశాఖ కార్యదర్శి...

కేంద్ర మత్స్యశాఖ కార్యదర్శి డాక్టర్ అభిలాస్ ఎల్ గురువారం విశాఖ వస్తున్నారు. ఢిల్లీ నుంచి విమానంలో గురువారం రాత్రి 8.10 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ నుంచి నగరంలో హోటల్‌కు చేరుకుని బస చేస్తారు. ఈ నెల 6న రాత్రి 8.55 గంటలకు విమానంలో ఢిల్లీకి బయలుదేరుతారు.

స్పెషల్ రైళ్లు పొడిగింపు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ప్రస్తుతం నడుస్తున్న పలు స్పెషల్ రైళ్లను మరికొంతకాలం పొడిగిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు.

- కొచ్చువేలి–షాలిమర్(06081) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ (ప్రతీ శుక్రవారాలలో) నవంబరు 29వ తేదీ వరకు, తిరుగు ప్రయాణంలో షాలిమర్– కొచ్చువేలి(06082) స్పెషల్ (ప్రతీ సోమవారాలలో) డిసెంబరు 2వ తేదీ వరకు నడుస్తాయి.
- తిరునల్వేలి–షాలిమర్ (06087) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ (ప్రతీ గురువారాలలో) నవంబరు 28వ తేదీ వరకు, తిరుగు ప్రయాణంలో షాలిమర్–తిరునల్వేలి (06088) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ (ప్రతీ శనివారాలలో) నవంబరు 30వ తేదీ వరకు నడుస్తాయి.
- కోయంబత్తూర్–బరౌని (06059) స్పెషల్ (ప్రతీ మంగళవారాలలో) నవంబరు 26వ తేదీ వరకు, తిరుగు ప్రయాణంలో బరౌని–కొయంబత్తూర్ (06060) స్పెషల్ (ప్రతీ శుక్రవారాలలో) నవంబరు 29వ తేదీ వరకు నడుస్తాయి.
- కోయంబత్తూర్–ధన్‌బాద్ జంక్షన్ (06063) స్పెషల్ (ప్రతీ శుక్రవారాలలో) నవంబరు 29వ తేదీ వరకు, తిరుగు ప్రయాణంలో ధన్‌బాద్–కొయంబత్తూర్(06064) స్పెషల్ (ప్రతీ సోమవారాలలో) డిసెంబరు 2వ తేదీ వరకు నడుస్తాయి.
- ఎర్నాకుళం–పాట్నా(06085) అన్ రిజర్వుడు సమ్మర్ స్పెషల్ రైలు (ప్రతీ శుక్రవారాలలో) నవంబరు 29వ తేదీ వరకు, తిరుగు ప్రయాణంలో పాట్నా–ఎర్నాకుళం (06086) స్పెషల్ రైలు (ప్రతీ సోమవారాలలో) డిసెంబరు 2వ తేదీ వరకు నడుస్తాయి.

పండగలకు స్పెషల్ రైళ్లు

దసరా, దీపావళి పండగల సందర్భంగా షాలిమర్–చెన్నై, సంత్రగచ్చి–సికింద్రాబాద్ మధ్య వయా దువ్వాడ మీదుగా స్పెషల్ రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు.

- షాలిమర్–ఎంజీఆర్ చెన్నై సెంట్రల్(02841) స్పెషల్ (ప్రతీ సోమవారాలలో) సెప్టెంబరు 30 నుంచి నవంబరు 18వ తేదీ వరకు, తిరుగు ప్రయాణంలో ఎంజీఆర్ చెన్నై సెంట్రల్–షాలిమర్ (02842) స్పెషల్ (ప్రతీ బుధవారాలలో) అక్టోబరు 1వ తేదీ నుంచి నవంబరు 20వ తేదీ వరకు నడుస్తాయి.
- సంత్రగచ్చి–సికింద్రాబాద్ (08845) స్పెషల్ (ప్రతీ శుక్రవారాలలో) అక్టోబరు 4 నుంచి నవంబరు 15వ తేదీ వరకు, తిరుగు ప్రయాణంలో సికింద్రాబాద్–సంత్రగచ్చి (08846) స్పెషల్ (ప్రతీ శనివారాలలో) అక్టోబరు 5 నుంచి నవంబరు 16వ తేదీ వరకు నడుస్తాయి.

దులీప్ ట్రోఫీలో విశాఖ కుర్రోళ్లు

సత్తాచాటేందుకు సిద్ధమైన నితీష్, భరత్, రికీబుయ్



నితీష్



భరత్



రికీబుయ్

విశాఖ స్పోర్ట్స్: దేశవాళీ క్రికెట్‌లో ప్రతిష్టాత్మకమైన దులీప్ ట్రోఫీ తొలి దశ మ్యాచ్‌లు గురువారం నుంచి బెంగళూరు, అనంతపురం వేదికగా ప్రారంభం కానున్నాయి. ఈ టోర్నమెంట్‌లో విశాఖకు చెందిన నితీష్ కుమార్ రెడ్డి, భరత్, రికీ బుయ్‌లు తమ ప్రతిభను చూపించేందుకు సిద్ధమవుతున్నారు. నితీష్ కుమార్‌రెడ్డి ఐపీఎల్‌లో బ్యాటింగ్‌తో పాటు బౌలింగ్‌లోనూ రాణించాడు. జింబాబ్వేతో జరిగిన సిరీస్‌కు ఎంపికైనా గాయం కారణంగా అవకాశం కోల్పోయాడు. భరత్‌కు భారత జట్టు తరఫున టెస్ట్ క్రికెట్ ఆడిన అనుభవం ఉంది. వికెట్ కీపర్‌గా అద్భుతమైన ప్రతిభను కనబరుస్తున్నాడు. రికీ బుయ్ తనదైన స్టైల్‌తో అంతర్జాతీయ క్రికెట్ ఆడుతున్నాడు. బ్యాటింగ్‌లో అద్భుత ప్రతిభను కనబరుస్తున్నాడు. ఈ టోర్నమెంట్‌లో వీరు రాణించి భారత జట్టులో చోటు సంపాదించాలని విశాఖ క్రీడాభిమానులు ఆశిస్తున్నారు.

విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అదనపు ఎస్పీగా స్నేహిత

అల్లిపురం: విశాఖపట్నం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అదనపు ఎస్పీగా ఎం.స్నేహిత నియమితులయ్యారు. ఈ మేరకు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్ హరీష్‌కుమార్ గుప్తా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.